ఈనాడు
ఏలూరు
మంగళవారం అక్టోబరు 22, 2024 5



అవును.. అది చిరుతే

భీమడోలు పరిసరాల్లో సంచారం

భీమడోలు, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: భీమడోలు పరిసరాల్లో సంచరిస్తున్న జంతువు చిరుతపులి అని నిర్ధారణ అయ్యింది. అటవీ శాఖాధికారులు భీమడోలు శివారు ద్వారకా తిరుమల మండల పరిధిలోకి వచ్చే అందనాలమ్మ చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో చిరుత స్పష్టంగా కనిపించింది. దీంతో అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. భీమడోలు సీఐ యు.జె. విల్సన్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భీమడోలు మండలం అంబరుపేట, పోలసానిపల్లి, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి, అందనాలమ్మ చెరువు, కాట్రగడ్డ కల్యాణ మండపం పరిసరాల్లో ఒంటరిగా తిరగవద్దని హెచ్చరిస్తూ సోమవారం టాంటాం వేయించారు. డీఎఫ్‌వో ఆశాకిరణ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేశారు.



బోను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



జడ్పీ సీఈవోకు దరఖాస్తు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యులు

రసవత్తరంగా జడ్పీ రాజకీయాలు!

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వినతి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ప్రస్తుతం ఉమ్మడి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ కొనసాగుతున్నారు. ఆమె ఇటీవల వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. అప్పటినుంచి వైకాపాకు చెందిన జడ్పీటీసీ సభ్యులు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. ఆమెను ఎలాగైనా ఛైర్‌పర్సన్ పదవి నుంచి దించేయాలని యత్నాలు చేస్తున్నారు. అది సాధ్యం కానందున ఉమ్మడి జిల్లాలోని 31 మంది జడ్పీటీసీ సభ్యులు సోమవారం ఏలూరులోని జడ్పీ అతిథి గృహంలో సమావేశమయ్యారు. అంతర్గతంగా చర్చించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలవడానికి ఆమె క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త ప్రసాద్‌ను కలిశారు. ముందుగా సమాచారం ఇస్తే బాగుండేదని, ఛైర్‌పర్సన్ పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లారని తెలిపారు. అక్కడి నుంచి జడ్పీటీసీ సభ్యులు బయటకు వచ్చి మరోసారి సమావేశం నిర్వహించుకున్నారు. అనంతరం జడ్పీ కార్యాలయంలోని సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావును కలిశారు. జడ్పీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించాలని.. ఒక పార్టీపై గెలిచి, మరో పార్టీలోకి వెళ్లిన పద్మశ్రీని ఆ పదవి నుంచి తప్పించాలని కోరుతూ 31 మంది సంతకాలతో కూడిన దరఖాస్తు అందజేశారు. అనంతరం జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ పద్మశ్రీ వైకాపా గుర్తుపై జడ్పీటీసీ సభ్యురాలుగా ఎన్నికయ్యారని, తామందరం ఆమెను జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని తెలిపారు. పార్టీ మారిన ఆమెను పదవి నుంచి తప్పించాలని, అందుకు సంబంధించి మూడు రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని సీఈవోకు దరఖాస్తు అందించామన్నారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యులు తనను కలిసి దరఖాస్తు అందజేశారని, వారి విన్నపాన్ని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.






అమరులకు వందనం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఏలూరులోని పోలీసు మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌మార్ , ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పాల్గొన్నారు. - 6లో..

స్వాధీనాల్లో స్వాహాపర్వం



- విస్మయం కలిగిస్తున్న కొందరు పోలీసుల తీరు
- పట్టుబడిన సొత్తు దారి మళ్లిస్తూ మాయ
- పోయిందానికి ఇచ్చేదానికి పొంతన లేని వైనం

ఈనాడు, ఏలూరు : ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుల్లో కొందరు భక్షకుల అవతారమెత్తుతున్నారు. నిలువు దోపిడీతో సర్వం కోల్పోయిన వారికి బాసటగా నిలవాల్సింది పోయి.. దోపిడీకి దిగుతున్నారు. చేస్తున్న అరకొర స్వాధీనాల్లో సైతం చేతివాటం చూపిస్తున్నారు.

☛ ఆగస్టులో జంగారెడ్డిగూడెంలోని ఓ ఇంట్లో 7 కాసుల బంగారం చోరీ జరగగా ఇటీవల పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. రికవరీ సైతం చూపించారు. బాధితుడికి మాత్రం బంగారం ఇవ్వలేదు. ఇదేమిటని అడిగితే అది గతంలో జరిగిన చోరీ అంటూ బుకాయించారు. బాధితుడికి ఉన్న పరిచయాలతో స్వాధీనం చేసుకున్న ఆభరణాల చిత్రాలు సంపాదించారు. చూస్తే అది అతని బంగారమే అని తెలిసింది.

☛ గతంలో అశ్వారావుపేట మండలానికి చెందిన నాగేంద్రబాబు, బాబూరావు అటు తెలంగాణతోపాటు జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెంలో మహిళల నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించారు. వీరిని జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ పోలీసులు అరెస్టు చేశారు. 502.6 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. రికవరీలో మాత్రం 406.06 గ్రాములు చూపించారు. నిందితుల నుంచి తీసుకున్న మధ్యవర్తుల నివేదికలో మాత్రం తమ నుంచి మొత్తం బంగారం తీసుకుని పోలీసులు 406.06 గ్రాములే రికార్డు చేసినట్లు తెలిపారు.

అప్పగింతల్లో అవకతవకలు

ఉభయ జిల్లాల్లోని కొందరు పోలీసులు పలు నేరాల్లో బాధితులై ఆర్థికంగా చితికిపోయిన వారిని సైతం రాబందుల్లా పీక్కుతింటున్నారు. చేస్తున్న అరకొర స్వాధీనాల్లో కాసుల వేట సాగిస్తున్నారు. వారు పట్టుకున్న బంగారానికి, బాధితులకు అప్పగిస్తున్న సొత్తుకు పరిమాణంలో, నాణ్యతలో భారీగా వ్యత్యాసం ఉంటోంది. రెండు నెలల క్రితం ఏలూరులో వేణుగోపాల స్వామి ఆలయం, రామకోటి, దక్షిణపువీధి తదితర ప్రాంతాల్లో బంగారు గొలుసుల చోరీలు జరిగాయి. వాటిని గణపవరం పోలీసులు పట్టుకున్నారు.

అన్నింటా ఇదే అంతు

దాదాపు 90 శాతం కేసుల్లో బాధితులు.. మిగిలిన సొత్తు గురించి అడిగితే దొంగలు చిల్లరగా అమ్ముకున్నారని అందుకే దొరకలేదని కథ ముగిస్తున్నారు. నాణ్యత విషయంలోనూ రాగి కలిపిన బంగారం ముట్టజెబుతున్నారన్న విమర్శలున్నాయి. జూదాలు, కోడిపందేల సమయంలో పట్టుకున్న మొత్తాన్ని కూడా కొందరు పోలీసులు దారి మళ్లిస్తున్నారు. సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాల విషయంలోనూ చేతివాటం ఉంటోంది. దీనిపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రికవరీల విషయంలో పోలీసుల తీరుపై పరిశీలిస్తామన్నారు. సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రణాళిక ప్రకారం దోపిడీ

బాధితులు ఇచ్చే ఫిర్యాదులో ఆభరణాలు, వస్తువులు మాత్రమే పోయినట్లు రాయాలని, నగదు ప్రస్తావన వద్దంటూ పోలీసులు ఆంక్షలు పెడుతున్నారు. ఇటీవల ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల్లో దాదాపు రూ. 10 లక్షల వరకు చోరీ కాగా ఒక్క ఫిర్యాదులో కూడా నగదు ప్రస్తావన లేకుండా కథ నడిపించారు. దీంతో దొంగలు దొరికినప్పుడు స్వాధీనం చేసుకున్న నగదు మొత్తం స్వాహా చేస్తున్నారు.



శేషవాహన సేవ



చందన స్వరూపుడు వేంకటేశ్వరుడు



కేరళ కళాకారుల వాయిద్యం

బ్రహ్మోత్సవం.. భక్తజన సంబరం

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గోవింద నామ స్మరణలు మిన్నంటిన వేళ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. పండితుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. శుభముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. అనంతరం మూలమూర్తికి ఎమ్మెల్యే సత్యానందరావు, ఈవో సూర్యచక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. తొలివాహనమైన ఏడుపడగల ఆదిశేషునిపై రాత్రి ఉభయ దేవేరులతో పరావాసుదేవ అలంకారంలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. బ్రహ్మోత్సవంలో రెండో రోజు మంగళవారం అష్టదళపాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ జరగనుంది.

విద్యుత్తు శాఖలో బదిలీలు

పలువురు ఈఈలు, ఏడీఈలకు స్థానచలనం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యుత్తు శాఖలో బదిలీలు జరిగాయి. పలువురు ఈఈలు, ఏడీఈలను బదిలీ చేస్తూ సోమవారం సాయంత్రం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏఈలను పరిశీలిస్తే.. నరసాపురంలో పని చేస్తున్న బి.సురేష్ కుమార్‌ను విశాఖ కార్పొరేట్ కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న పీవీవీ సత్యనారాయణను ఏలూరు డీపీఈ విభాగానికి బదిలీ చేశారు. ఏలూరు సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న పీర్ అహ్మద్ ఖాన్‌ను తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెంలో పని చేస్తున్న పి.రాధాకృష్ణను ఏలూరు టెక్నికల్ విభాగానికి బదిలీ చేశారు.

ఏడీఈలు ఇలా.. జీలుగుమిల్లిలో పనిచేస్తున్న టి.రాజ్‌కుమార్‌ను ఏలూరు టౌన్‌కు, ఏలూరు టౌన్‌లో పని చేస్తున్న బీవీ కృష్ణరాజును పెదవేగికి బదిలీ చేశారు. ఏలూరు పవరుపేట ఏఈగా పనిచేస్తున్న ఎన్.పద్మినికి పదోన్నతి కల్పించి ఏడీఈగా జీలుగుమిల్లికి పంపించారు.

అపార్.. ఆపసోపాలు!

ఆధార్ నవీకరణ లేక అవస్థలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూపొందించిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ సాంకేతిక అడ్డంకులతో జిల్లాలో మందకొడిగా సాగుతోంది.

ప్రస్తుతానికి వీరికే..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ముఖ చిత్రంతో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయడం ద్వారా విద్యార్థికి సంబంధించి అన్ని వివరాలు వెల్లడవుతాయి. ప్రస్తుతానికి 9, 10, ఇంటర్ వారికి కార్డులు జారీ చేయనున్నారు.



వివరాలు నవీకరించుకుంటున్న విద్యార్థి

ఇదీ ఉపయోగం..

కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్(ఏబీసీ)ను కేటాయిస్తోంది. దాని ఆధారంగా అపార్ గుర్తింపు సంఖ్య, కార్డు జారీ అవుతుంది. దాని సాయంతో పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకు దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ప్రవేశాలు పొందే సమయంలో అవసరమైన గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకెళ్లే అవసరం ఉండదు. విద్యార్థి బ్యాంకు ఖాతా నంబరు, డిజీలాకర్ సదుపాయం అపార్‌కు అనుసంధానమై ఉంటుంది.

80కు పైగా పాఠశాలల్లో ప్రారంభమే కాలేదు..

పాఠశాల దస్త్రాలు, ఆధార్, పేరులో అక్షర భేదాలు, పుట్టిన తేదీ సరిపోలకపోవడం వంటి అంశాల్లో వ్యత్యాసం ఉంటే నమోదుకు ఇబ్బందవుతోంది. ఈ క్రమంలో ఆధార్ వివరాల నవీకరణకు విద్యార్థులు ఆయా కేంద్రాల వద్ద బారులుదీరుతున్నారు. పాఠశాలలో నమోదైన వివరాలు సరిచేయాల్సి వస్తే యుడైస్ ప్లస్ అంతర్జాలంలో అనుమతి లేక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. మరోవైపు గడువు పేరుతో ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. పలు కారణాల నేపథ్యంలో సుమారు 80కు పైగా పాఠశాలల్లో ఇప్పటికీ నమోదు ప్రక్రియ పట్టాలెక్కలేదు.

జిల్లాలో వివరాలు

9, 10 విద్యార్థులు: **54,769**

ఇప్పటి వరకు నమోదు: **12068**

పూర్తయిన శాతం: **22.03**

ఎంఈవో లాగిన్‌కు సవరణ అవకాశం..

యుడైస్ ప్లస్ అంతర్జాలంలో విద్యార్థుల వివరాల సవరణకు ఎంఈవోల లాగిన్‌కు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాధికారి ఎస్.అబ్రహాం పేర్కొన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, వివరాలను మార్పు చేసుకోవచ్చు. ఇందుకు కేటాయించబడిన ఫార్మట్ ఎస్‌వో 3 లో ఆ వివరాలను ఎంఈవో కార్యాలయ సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని త్వరితగతిన అపార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు.

నవంబరులో సాగునీటి సంఘాల ఎన్నికలు



ఏలూరు కాలువ

ఉంగుటూరు, ఏలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 26 మండలాల పరిధిలో 356 సాగునీటి వినియోగదారుల సంఘాలు(డబ్ల్యూయూఏ) ఉన్నాయి. వీటిలో మేజర్ ఇరిగేషన్ పరిధిలో 92, మీడియం ఇరిగేషన్ 11, మైనర్ ఇరిగేషన్ 253 సంఘాలకు నవంబరులో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సంఘాలు 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 26 మంది తహసీల్దార్లు, 26 మంది జలవనరులశాఖ ఏఈఈ, డీఈఈలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల వారీగా సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా తయారు చేస్తారు. నవంబరు 21 - 23 తేదీల మధ్య సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికలు పూర్తి చేస్తారు. 24 - 26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలు(డీసీలు), 27 - 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ(పీసీ) కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. నీటి పారుదల వ్యవస్థ పర్యవేక్షణలో కీలకమైన సాగునీటి సంఘాలు గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఉనికిని కోల్పోయాయి. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పటిష్ఠం

కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం : జేసీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీ ధాత్రి రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌకధరల దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్ల పనితీరుపై పౌరసరఫరాల సంస్థ, రెవెన్యూ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలోని ఆరు ఎంఎల్ఎస్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందజేసే నిత్యావసర సరకుల నిల్వ, పంపిణీ తీరును కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. నిత్యావసరాల పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 77020 03584 నంబరుకు లేదా 08812-230448 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

'పది' విద్యార్థులకు అధ్యయన పుస్తకాలు

ఏలూరు వన్‌టౌన్, విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే 32,757 మంది విద్యార్థులకు జిల్లా పరిషత్తు ఆర్థిక సహకారంతో 'అధ్యయన పుస్తకాలు' రూపొందించాలని నిర్ణయించినట్లు డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు తెలిపారు. పుస్తకాల రూపకల్పనకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40 మంది విషయ నిపుణులను గుర్తించగా వారికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దిశానిర్దేశం చేశారన్నారు. 'విజయ కేతనం' పేరుతో రూపొందించనున్న పుస్తకాలను విద్యార్థులకు వీలైనంత త్వరలో అందించాలని ఆమె సూచించారని తెలిపారు. ★ప్రతి తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఒక ఉపాధ్యాయుడు వారిని దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. సోమవారం జడ్పీ కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గత ఏడాది రూపొందించిన విజయ కేతనం స్టడీ మెటీరియల్ రాష్ట్రంలోనే ఆదర్శమైందన్నారు.

33 రోజులు.. రూ.3.03 కోట్ల హుండీ కానుకలు



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో లభించింది. స్థానిక దేవస్థానం కల్యాణ మండపంలో ఆలయాధికారులు సోమవారం హుండీలు తెరిచి నగదు లెక్కించారు. గడిచిన 33 రోజులకు రూ.3,03,89,678 నగదు, 597 గ్రాముల బంగారం, 8.244 కిలోల వెండి లభించినట్లు ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

శవాగార ఉద్యోగి తొలగింపు

మృతదేహాల మాయంపై సాగుతున్న విచారణ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారంలో మృతదేహాల మాయం వ్యవహారంపై ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సుధాకర్ బృందం విచారణ చేస్తోంది. 8న రాత్రి శవాగారం నుంచి మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించి దొరికిన మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను విధుల నుంచి తొలగిస్తూ సుధాకర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొంతకాలం నుంచి శవాగారంలోని మృతదేహాలను మాయం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చెన్నై, ఇతర రాష్ట్రాలకు చెందిన వైద్య కళాశాలలకు వాటిని అమ్మేస్తున్నారని తెలిసింది. ఇప్పటి వరకు ఎన్ని మృతదేహాలను ఏయే వైద్య కళాశాలలకు అనధికారికంగా అమ్మారు, ఎప్పుడెప్పుడు ఎంతకు విక్రయించారనే విషయమై కూపీ లాగుతున్నారు. ఈ వ్యవహారంలో అశోక్‌తో పాటు ఇంకెంతమంది ఉన్నారో వారి వివరాలనూ బయటకు తీస్తున్నారు. మొత్తం నలుగురైదుగురు ముఠాగా ఏర్పడి ఈ దందా చేసినట్లుగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. వీరి వెనుక చక్రం తిప్పింది శవాగారానికి అనుబంధంగా ఉన్న విభాగంలోని ఓ అధికారి అని ఆరోపణలు రావడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. నాలుగైదు రోజుల్లో ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఓ నివేదిక తయారుచేయనున్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

చేబ్రోలులో కేంద్రాన్ని ప్రారంభించనున్న మంత్రి మనోహర్

నారాయణపురం, ఉంగుటూరు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు ముప్పు తిప్పలు పడ్డారు. ప్రతి ధాన్యం గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తాం. అన్నదాతలు ఇబ్బందులు పడకుండా గోనె సంచులు, రవాణాకు వాహనాల కొరత లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. ఇలా ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు వైకాపా పాలకులు ఊదరగొట్టేవారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉండేది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ధాన్యం కొనుగోలు చేపట్టనుంది. రైతులకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించడం, 48 గంటల్లో నగదు జమ, రంధ్రాలు లేని గోనె సంచులు సరఫరా చేస్తామని ప్రకటించింది. జిల్లాలో మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చేబ్రోలులో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రారంభించనున్నారు. 'జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బందులు పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. రవాణా వాహనాలకు జీపీఎస్ అమర్చాం.' అని సంయుక్త కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి అన్నారు.



ధాన్యం పట్టుబడిని పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్

వరి సాగు : 1.80 లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా: 5.60 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు లక్ష్యం: 3.40 ,,
సేకరణ కేంద్రాలు: 250
సిద్ధం చేసిన సంచులు: 12 లక్షలు

ధాన్యం సేకరణలో సమస్యలుంటే చేయాల్సిన ఫోన్ నంబర్లు: 08812 230488, 77020 03584
టోల్‌ఫ్రీ నంబరు : 1800 425 6453

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే 'మీకోసం' కార్యక్రమంలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్‌తో పాటు జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీశ్ తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.



సిబ్బందితో అర్జీలు రాయించుకుంటున్న ప్రజలు

● ముసునూరు మండలం గుల్లపూడి, లోపూడి, చెక్కపల్లి, లింగపాలెం మండలం కలరాయనగూడెం గ్రామాల రైతులు నకిలీ మొక్కజొన్న విత్తనాల కారణంగా నష్టపోయారని, వారికి తగిన న్యాయం చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. భారీ వర్షాలు తదితర అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. తుపాను కారణంగా ఒడిశాలో అధిక వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో గోదావరికి వరద కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండుగా ఉన్నాయని, వాటి గట్లకు ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రైతేరాజు
మిశ్రమ సేద్యం.. లాభయోగ్యం..! 6లో



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ప్రతాప్ శివకిశోర్

వేధింపులకు గురి చేసే వడ్డీ వ్యాపారులపై చర్యలు: ఎస్పీ

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: వడ్డీల పేరుతో వేధింపులకు గురి చేసే వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలువురు వచ్చి ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు తీసుకున్న వారిని వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది దళారులు మోసం చేస్తున్నారని తెలిపారు. వడ్డీ వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకుని ఇబ్బందులు పడవద్దని సూచించారు. ప్రజలను వేధించే వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సైబర్ నేరాలకు గురికావద్దని, వారి చేతిలో మోసపోతే 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మొత్తం 38 ఫిర్యాదులు అందాయని, వాటన్నిటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఆదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

నెక్‌కో: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 లింగ్ ధర 157 విత్ స్కిన్ - 228, విత్ స్కిన్‌లెస్ - 259. అనూరాధ పౌల్ట్రీ ఫార్మ్స్ & ఫీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 విత్ స్కిన్ - 266 విత్ స్కిన్‌లెస్ - 278.

యువతా.. నైపుణ్య ప్రాప్తిరస్తు!

✪ పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు ✪ ఈ నెల 25వరకు అవకాశం

పాలకొల్లు, న్యూస్‌టుడే

✦ నరసాపురానికి చెందిన అవినాష్ డిగ్రీ పూర్తిచేశాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూకు హాజరవ్వగా ఏయే అంశాల్లో ప్రావీణ్యం ఉందని, ఏరంగంలో నైపుణ్యం ఉందని ప్రశ్నిస్తే సమాధానం కరువయ్యింది. ఉద్యోగాల వేటలో నేడు కేవలం చదువు ఒక్కటే సరిపోదని అంతిమంగా అవినాష్‌కు అర్థమయ్యింది. ఇటువంటి యువత కోసమే కేంద్రం పీఎం ఇంటర్న్‌షిప్‌ను తీసుకొచ్చింది. ప్రముఖ సంస్థల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యం పెంపొందించడానికి ప్రస్తుతం అంతర్జాలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని సుమారు 20 వేల మంది యువతకు ఇదొక మంచి అవకాశంగా చెప్పవచ్చు.



అర్హులెవరంటే... పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీలోని వివిధ సబ్జెక్టులు పూర్తిచేసినవారు, డిప్లొమా చేసినవారు పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 21 నుంచి 24 సంవత్సరాల లోపు ఉండాలి. కేంద్ర మంత్రిత్వ శాఖ www.pminternship.mca.gov.in పోర్టల్‌లో అంతర్జాలం ద్వారా అభ్యర్థి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 25వరకు దీనికి అవకాశం ఇచ్చారు. ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబర్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌తో ఈకేవైసీ పూర్తిచేయాలి. చిరునామా, కేటగిరి, ఈ మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి.

ఈ పత్రాలు కావాలి... ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, విద్యార్హత పత్రం, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. ఎంపికైతే మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుంది. వెబ్‌సైట్ నుంచి లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆబ్జెక్టివ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతోపాటు వన్‌టైం గ్రాంటుగా రూ.6 వేలు, ప్రతినెలా ప్రభుత్వం 4,500, కంపెనీ రూ.500 చొప్పున డీబీటీ ద్వారా జమచేస్తారు. ఏడాదికి ఇలా రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

వీటిలో నైపుణ్యం... ఈ పథకంలో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్‌అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చి అభ్యర్థులకు నైపుణ్యం పెంపొందించనున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే యువత ఉపాధికి ఢోకా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

సైనిక లాంఛనాలతో ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు



ప్రవీణ్‌కుమార్ (పాత చిత్రం)

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: గుండెపోటుతో మరణించిన హవాల్దార్ మృతదేహానికి సైనిక లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. కొయ్యలగూడేనికి చెందిన రావిపాటి ప్రవీణ్‌కుమార్(40) భారత సైన్యం(616 ఈఎంఈ బెటాలియన్)లో హవల్దార్‌గా రాజస్థాన్ రాష్ట్రం సూరత్‌ఘడ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల సెలవులపై ఇంటికొచ్చారు. తిరిగి విధుల్లో చేరేందుకు శనివారం రైలులో వెళ్తుండగా- విశాఖపట్నం వద్ద గుండెపోటుతో మరణించారు. విశాఖపట్నంలోని ఆర్మీ బేస్ క్యాంపులో గౌరవ వందనాలతో నివాళులర్పించాక, సోమవారం మృతదేహాన్ని కొయ్యలగూడేనికి తీసుకొచ్చారు. సైనిక లాంఛనాలతో మృతదేహంపై జాతీయ పతాకం కప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, తహసీల్దారు చెల్లన్న దొర ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్మీ అధికారులు సుబేదార్ కిరణ్‌కుమార్, సీఎఫ్ఎన్ లక్ష్మీకాంత్, డీబీ లింబు, కుల్వీందర్‌సింగ్, డి.రామకోటి, సర్పంచి ముప్పిడి విజయకుమారి, స్థానిక పోలీసులు, అధికారులు అంతిమ వీడ్కోలు పలికారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

జీఎంఆర్ సంస్థలు నెలకొల్పండి : ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జీఎంఆర్ సంస్థలు నెలకొల్పాలని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ ఆ సంస్థల వ్యాపార ఛైర్మన్ జీవీఎన్ రావును కోరారు. దిల్లీలో సోమవారం ఆయనను మహేశ్‌కుమార్ కలిశారని ఎంపీ కార్యాలయ వర్గాల వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ప్రాంతంలో జీఎంఆర్ గ్రూపు సంస్థలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు వివరించారు.

ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ముగిశాయి. ఈ నెల 3న ప్రారంభమైన పరీక్షలు సెలవు రోజుల్లో మినహా నిరంతరాయంగా సాగాయి. సోమవారం జిల్లాలోని ఒక కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 186 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 166 మంది హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. మధ్యాహ్నం పరీక్షకు 96 మందికి 71 మంది హాజరయ్యారన్నారు.

కలుపు మందు తాగి రైతు ఆత్మహత్య

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: కలుపు మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామవరపుకోట మండలంలో చోటుచేసుకుంది. తడికలపూడి పోలీసుల కథనం మేరకు... కె.ఎస్.రామవరానికి చెందిన నాలి శ్రీనివాసరావు(47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పంటల సాగుకు పెట్టుబడులకు శ్రీనివాసరావు కొన్నాళ్ల కిందట బయట వ్యక్తుల నుంచి కొంత నగదు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని వ్యవసాయానికి కాకుండా సొంత అవసరాలు, మద్యానికి వాడుకున్నారు. ఈ విషయమై ఆదివారం కుటుంబంలో గొడవ చోటుచేసుకుంది. మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు స్థానికంగా ఓ పామాయిల్ తోటలోకి వెళ్లి మద్యంలో కలుపు మందు కలుపుకొని తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయన్ను కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తరలిస్తుండగా- మార్గం మధ్యలో శ్రీనివాసరావు మృతి చెందారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరస్పరం దాడుల కేసులో 11 మందికి జైలు శిక్ష

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రెండెకరాల భూమికి సంబంధించి రెండు కుటుంబాల మధ్య వివాదం ముదరడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలకు చెందిన 11 మందికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన పేకేటి రంగనాయకమ్మ, యలమర్తి భూపతయ్య కుటుంబాల మధ్య భూతగాదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2011 మే నెలలో భూపతయ్య కోడలు పద్మకు చెందిన రెండెకరాల్లోని తోటలో మామిడికాయలు కోసేందుకు వెళ్లగా అక్కడ రంగనాయకమ్మ వారి కుటుంబ సభ్యులు అడ్డుకుని గొడవపడ్డారు. రెండు కుటుంబాలకు చెందిన వారు కత్తులు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన ద్వారకా తిరుమల పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో తుది విచారణను ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి సోమవారం చేపట్టారు. నేరం రుజువైనందున ఓ వర్గానికి చెందిన వెంకటకృష్ణాపురానికి చెందిన రంగనాయకమ్మ, భాస్కర్ చౌదరి, దుర్గాదేవి, గాంధీ, సుబ్రహ్మణ్యంలకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మరో వర్గానికి చెందిన యలమర్తి భూపతయ్య, కాంతారత్నం, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, భాస్కర్ సురేష్, నల్లూరి శివనాగులకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సామిల్లు యాజమాన్యం నిర్లక్ష్యమంటూ బంధువుల ఆందోళన



చరణ్(పాత చిత్రం)

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పుట్లగట్లగూడేనికి చెందిన కొండయ్య, లక్ష్మి దంపతుల రెండో కుమారుడు కపులూరి చరణ్(17) గురవాయిగూడెం శివారులోని ఏలూరు రోడ్డులోని ఓ సామిల్లులో నెలరోజుల క్రితం కూలీగా చేరారు. సోమవారం కోతమిషన్‌లో చెట్ల దుంగలను రంపం భేదంతో కోస్తుండగా... మోటారుకు ఒక్కసారిగా విద్యుత్తు ప్రవహించింది. మోటారును పట్టుకున్న బాలుడు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. అతణ్ని తోటి కూలీలు జంగారెడ్డిగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చరణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో స్థానిక ప్రాంతీయాసుపత్రికి తీసుకెళ్లారు. తమ కుమారుడు మరణానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ.. మార్చురీ ఎదుట సీఐటీయూ నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సుభాషిణి డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనా స్థలిని డీఎస్పీ రవిచంద్ర, సీఐ కృష్ణబాబు పరిశీలించి వివరాలు సేకరించారు.



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, సీఐటీయూ నాయకులు

డెంగీ లక్షణాలతో విద్యార్థిని.. **లింగపాలెం, న్యూస్‌టుడే:** డెంగీ వ్యాధి లక్షణాలతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బోగోలుకు చెందిన దాసరి కాంతారావు, ప్రశాంతి కుమార్తె దాసరి అక్షయ(12) స్థానికంగా ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. మూడ్రోజుల కిందట తీవ్ర జ్వరం రావడంతో.. ఆమెను తల్లిదండ్రులు ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. డెంగీ లక్షణాలున్న గుర్తించి వైద్యం ప్రారంభించారు. ఈ క్రమంలో తెల్లరక్తకణాలు పడిపోయి బాలిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సోమవారం ఉదయం విజయవాడలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థినిని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి సేవియా నాయక్ బోగోలు చేరుకుని బాలిక కుటుంబాన్ని పరామర్శించారు.



అక్షయ (పాత చిత్రం)

విహార యాత్రకు వెళ్లి విగతజీవిగా మారి..



రవితేజ (పాత చిత్రం)

ఉంగుటూరు, మోతుగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన యువకుడు విహార యాత్రకు వెళ్లి విగతజీవిగా మారారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దొంతవరానికి చెందిన కర్లం వెంకటలక్ష్మికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రశాంత్ కలిసి చేబ్రోలులో ఉంటున్నారు. చిన్న కుమారుడు రవితేజ(22) తన స్నేహితులతో కలిసి ఈ నెల 18న విహార యాత్రకు ద్విచక్ర వాహనాలపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పోకలేరు వెళ్లారు. అక్కడ స్నానాలకు వాగులో దిగారు. కొద్దిసేపటికి రవితేజ కనిపించకపోవడంతో అతని ఆచూకీ కోసం స్నేహితులు గాలించారు. ఫలితం లేకపోవడంతో రవితేజ తల్లికి సమాచారమిచ్చారు. ఆమె శనివారం మారేడుమిల్లి వెళ్లి తన కుమారుడు కనిపించట్లేదని మోతుగూడెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం రవితేజ మృతదేహాన్ని మోతుగూడెం పోలీసులు కనుగొన్నారు. వారు స్నానం చేసిన ప్రాంతానికి సుమారు కిలోమీటరు దూరంలో మృతదేహం ఉంది. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం దొంతవరం తీసుకొచ్చారు.

గల్లంతై మృతదేహంగా మారి.. పెదవేగి, న్యూస్‌టుడే: ఈతకు వెళ్లి పోలవరం కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. పెదవేగి మండలం కవ్వకుంటకు చెందిన బెజవాడ ప్రసాద్(45) ఆదివారం సాయంత్రం పోలవరం కుడి కాలువలోకి దిగి ఈత కొడుతూ మునిగిపోయిన విషయం తెలిసిందే. చీకటి పడటంతో గాలింపు చర్యలు చేపట్టలేకపోయిన అగ్నిమాపక శాఖ అధికారులు సోమవారం ఉదయం కాలువలో గాలించగా ప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఏలూరులోని శవాగారానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి : ఐజీ


ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ఎనలేని సేవలందిస్తున్నారని, ప్రాణాలను సైతం అర్పిస్తున్నారని, వారి త్యాగాలు వెలకట్టలేమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఏలూరులోని పోలీసు మైదానంలో నిర్వహించారు. మరో ముఖ్య అతిథి కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలీసులు సమర్థంగా సేవలందించడం వల్లే అంతా స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ పోలీసులు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ అల్లరి మూకల దాడిలో గత సంవత్సరం మృతిచెందిన ఆగిరిపల్లి కానిస్టేబుల్ గంధం నరేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు మాట్లాడారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఎస్బీ సీఐ బి.ఆదిప్రసాద్, గణపవరం సీఐ సుభాష్, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, ఏలూరు వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషాతో పలువురు కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందించారు. దేశ వ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసుల పేర్లను అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు చదివి వినిపించారు.

అమరవీరులకు ఘన నివాళి

ముందుగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ ఏడాది అనారోగ్యంతో మృతి చెందిన ఎస్సై నరసింహారావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ చంద్రరావు, మరో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ మధుకుమార్ కుటుంబ సభ్యులకు ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు కలిసి నిర్వహించిన ప్రదర్శనను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అగ్నిమాపక కేంద్రం కూడలిలో మానహారం ఏర్పాటు చేశారు.

చిన వేంకన్న సేవలో నాదెండ్ల

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం సందర్శించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, బొలిశెట్టి శ్రీనివాస్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. మంత్రికి ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



మంత్రికి శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న నివృతరావు, ఎన్‌వీఎస్ఎన్ మూర్తి

3న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: జిల్లా అడహక్ చదరంగం కమిటీ, ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబరు 3న స్థానిక ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో అండర్-6, 8, 10, 12, 14, 16 బాలబాలికల రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు కో-కన్వీనర్ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 98482 85555 నంబర్లో సంప్రదించాలన్నారు.

విద్యార్థికి న్యాయం చేయాలని వినతి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరులోని ఓ కళాశాలలో చదివిన చేబోయిన అచ్యుత్‌ను ఆ కళాశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని, ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకుల సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నాయకులు కె.నాని, పి.ప్రసన్న తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రజక వృత్తి చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రజక వృత్తి చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని రజక జన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక సంఘ భవనంలో సోమవారం ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తి చెరువుల్ని సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించాలన్నారు.

మిశ్రమ సేద్యం.. లాభయోగ్యం..!



సిద్ధాంతంలో దొండ పందిర్లు కింద వేసిన కంద పంట

తక్కువ విస్తీర్ణంలో సత్ఫలితాలు సాధిస్తున్న అన్నదాత

పెనుగొండ గ్రామీణ, మార్టేరు, న్యూస్‌టుడే

తక్కువ విస్తీర్ణంలో మిశ్రమ పంటలు సాగుచేస్తే మంచి ఆదాయం ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన కౌలు రైతు కుడిపూడి ముసలయ్య. చదివింది తక్కువైనా మిశ్రమ సాగులో సుదీర్ఘ అనుభవం సాధించారు. ప్రస్తుతం 90 సెంట్లు కౌలు భూమిలో దొండతో పాటు కంద సాగు చేస్తూ తనతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు.

దొండలో నష్టం ఉండదు

భూమి కౌలుతో పాటు విత్తనం, పందిరి, కూలీలు, ఇతర ఖర్చులన్నీ కలిపి సుమారు రూ.2.50 లక్షల దాకా అవుతోంది. అన్నీ అనుకూలిస్తే మంచి ఆదాయం వస్తోంది. కంద పంట కాలం ఆరు నెలలు. దొండ పంట చేతికి రావడానికి 180 రోజుల సమయం పడుతోంది. పంటను సిద్ధాంతం, పెనుగొండ ఇతర స్థానిక మార్కెట్‌లకు తీసుకెళ్లి విక్రయిస్తాం. ఒక్కోసారి మార్కెట్‌లో ఈ పంటలకు ఎక్కడా లేని డిమాండ్ ఉంటుంది. దొండ పంటలో నష్టమనే మాట ఉండదు.

కంద సాగులో..

కంద సాగు వెనుక కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. కంద మొక్క వేర్లు మట్టిని గుల్ల చేస్తాయి. పంటల మీద చీడ పీడల సమస్య అంతగా ఉండదు. పైగా పెట్టుబడి ఖర్చు తక్కువ. కాలానుగుణంగా పంట మార్పిడి కచ్చితంగా చేస్తే దాని ఫలితం కనిపిస్తోంది.

మంచి ఆదాయమే



'కూరగాయ సాగులో కష్టానికి తగిన ఆదాయం ఉంటుంది. నా వరకు ఈ రెండు పంటల మీద ఏడాదికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకు పైగా రాబడి ఉంటుంది. అడపాదడపా ఈ పంటలను గ్రామంలో తిరిగి అమ్మినప్పుడు వచ్చిన సొమ్ముతో ఇంటి ఖర్చులన్నీ అధిగమిస్తాం. పరిస్థితులకు అనువుగా పంటలను ఎంపిక చేసి సాగు చేస్తే సిరులు పండుతాయి' అని రైతు ముసలయ్య తెలిపారు.

వనామీ సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: వనామీ సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు, లాభాలు ఆర్జించవచ్చని ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు సూచించారు.

ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో.. కొన్ని రోజులుగా పగలు ఓ పక్క వర్షాలు కురుస్తున్నా.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి సమయంలో చలిగాలులు ప్రారంభమయ్యాయి. చెరువు నీటిలో తరచూ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వస్తే రొయ్యల్లో జీవక్రియ మందగిస్తుంది. కదలిక తగ్గి చెరువు అడుగు భాగానికి చేరుతుంటాయి. నీటిలో ఉదజని సూచిక, క్షారత్వం, లవణీయతల్లో వ్యత్యాసం చోటు చేసుకుంటాయి. వీటి ప్రభావంతో రొయ్యల్లో వ్యాధినిరోధకత తగ్గుతుంది. మేత వినియోగం తగ్గిస్తాయి. ఆ సమయంలో చెక్‌నెట్‌లను గమనించి రోజూ చల్లే మేత పరిమాణం తగ్గించాలి.



నివారణ చర్యలు.. చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గకుండా, 5 పీపీయం ఉండేలా చూడాలి. ఉదజని సూచిక తగ్గినప్పుడు వ్యవసాయ సున్నం వాడాలి. మేతలో విటమిన్ సి కలిపి వినియోగించాలి. చెరువు నీటిలో ప్రొబయోటిక్స్ చల్లాలి. అవసరమైతే ఆక్వా ల్యాబ్‌లో నీటి నాణ్యత పరీక్షలు చేయించి నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని గోపాలరావు సూచించారు.

రైతేరాజు

మీరూ అడగొచ్చు

ప్రశ్న: బొప్పాయిలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకి మారి రాలిపోతున్నాయి ఏం చేయాలి ?
- చంద్రశేఖర్, నీలాద్రిపురం

సమాధానం: లీటరు నీటికి మాంకొజెబ్ 2.5 గ్రా లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పిచికారీ చేయాలి. మార్కెటింగ్‌కి అనుకూలంగా లేని పచ్చికాయలను పాల సేకరణకు వినియోగించాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

✆ చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

మానిపండు తెగులు ఆశిస్తే నష్టం

మార్టేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరి పంటను మానిపండు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు టి.శ్రీనివాస్ సూచించారు. పంట పూత దశ నుంచి గింజ గట్టిపడే దశలో మంచు, వర్షం అధికంగా ఉంటే ఇది వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో అప్పుడే ఏర్పడుతున్న గింజల నుంచి ఆకుపచ్చ రంగులో శిలీంద్రం ముద్దగా స్రవిస్తుంది. తర్వాత అది నల్లగా మారుతుంది. దీని వల్ల తాలు గింజలు ఏర్పడతాయి. పైరు 50 శాతం వెన్ను బయటకు వచ్చిన సమయంలో (సాయకాలం) శిలీంద్రనాశక మందులు వాడాలి. కార్బండిజమ్ 1గ్రాము లేదంటే ప్రొపికొనజోల్ 1 మిల్లీ లీటరు లేదా క్రెసాక్సిమ్ మిథైల్ 1మిల్లీ లీటరు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో, గట్ల చుట్టూ కలుపు మొక్కలను తొలగించాలి.

ఏలూరు
•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ఎన్టీఆర్ వైద్య మిత్రుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్య మిత్రుల సమస్యలు పరిష్కరించాలని వైద్య మిత్రుల కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా నాయకులు ఎ.నాగబాబు, శ్రీనివాస్, సూర్యనారాయణ, లక్ష్మణ్‌కుమార్ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.రాజీవ్‌కు ఏలూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందించారు. 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న వైద్య మిత్రులకు కనీస వేతనం ఇవ్వడం లేదని, వీరిని ప్రభుత్వ విధానంలోకి మార్చాలని కోరారు. సిబ్బందికి అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న సమ్మెకు పిలుపునిచ్చామన్నారు.

నేడు వృద్ధుల దినోత్సవం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు సహాయ సంచాలకుడు రామ్‌కుమార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: శాంతినగర్ ఒకటో రోడ్డు చివర, 12-13 రోడ్ల మధ్య విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం చాలా కాలం నుంచి వెలగడం లేదు. చీకటితో ఇబ్బందులు పడుతున్నాం. - డి.రాములు, శాంతినగర్

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపాన్ని వెలిగిస్తాం. - కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: పాండురంగాపురం రెండో రోడ్డులోని కాలువలో మురుగు ముందుకెళ్లడం లేదు. వాడుక నీరు ఇళ్ల మధ్యే నిలిచిపోతోంది. - జి.నరేశ్‌కుమార్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయిస్తాం. - జి.చంద్రయ్య, నగర పాలక సహాయాధికారి

సమస్య: ఆర్ఆర్‌పేట ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులోని కాలువలో నెల రోజులుగా పూడిక తీయడం లేదు. మురుగు రోడ్డుపై నిలిచిపోవడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - టి.బాలాజీ, స్థానికుడు

సమాధానం: కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగిస్తాం. - కంభంపాటి స్టీఫెన్‌రాజు, పారిశుద్ధ్య తనిఖీదారు

ప్రతిభ విరిసె

'ఈనాడు' ఆధ్వర్యంలో పోటీ

ఏలూరు విద్య విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగున్న సృజనను వెలికి తీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శాంతినగర్‌లోని శ్రీ భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 8, 9, 10 తరగతుల బాలబాలికలు పోటీల్లో ప్రతిభను చాటారు. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని చక్కని దస్తూరితో, అర్థవంతమైన పదాలతో తమ అభిప్రాయాలను వెల్లడించారు. శ్రీభారతి విద్యా సంస్థల అధినేత అన్నపనేని రవికుమార్ సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల కరస్పాండెంట్ అన్నపనేని రాజేంద్ర (బుజ్జి) చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా ఎం.సురేశ్, ఎ.శ్రీనివాస్, ఎం.సుబ్రహ్మణ్యం, టి.కృష్ణ వ్యవహరించారు. ప్రధానాచార్యుడు యు.రాధాకృష్ణ పర్యవేక్షించారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

విజేతలు వీరే: ప్రథమ: ఎస్.చైతుశ్రీ, ద్వితీయ: పి.పూజిత, ద్వితీయ: ఎస్.నిత్య

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలన్నా, పాఠశాల, కళాశాలల్లో చేరాలన్నా, బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు ఇలా ఏ అవసరానికైనా ఆధార్ కార్డు తప్పనిసరి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆధార్ లేనిదే ఏ పనీ కాదు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకున్నా, అందులో తప్పిదాలున్నా ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండాలని, ఇప్పటికే తీసుకుని చాలా కాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా చాలా మంది ముందుకు రావడం లేదు. అవసరమైనప్పుడు ఆ ఇబ్బందులు ఏమిటో తెలుస్తున్నాయి. అప్పుడు ఆధారాలకోసం పరుగులు తీస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు వీటిని సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి.. 'ఆధార్ సేవలు పొందేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాలు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం చేసుకోవచ్చు. తగిన ధ్రువపత్రాలతో శిబిరాలకు హాజరవ్వాలి' అని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు.


ఉంగుటూరు సచివాలయం-1లో ఆధార్ శిబిరం

ఏలూరులో.. ఏలూరు గ్రామీణ: ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని యాదవ్ నగర్, పోడిబిట్టు, తోటకూరదిబ్బ, నరసింహారావుపేట, మోతేవారితోట, శేఖర్‌వీధి, పోస్టల్ కాలనీ, కోటదిబ్బలోని సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

ఉంగుటూరు మండలం.. 22న ఉంగుటూరు, 23న నారాయణపురం, 24న గొల్లగూడెం, 25న కైకరం పంచాయతీ కార్యాలయాలు. **భీమడోలు..** 22, 23 తేదీల్లో చెట్టున్నపాడు, పూళ్ల-1 భీమడోలు-1, 24, 25 తేదీల్లో ఆగడాలలంక, పూళ్ల-3, సూరప్పగూడెం సచివాలయాలు. **నిడమర్రు..** 22న ఛానమిల్లి, 23న అడవికొలను, 24న బువ్వనపల్లి, 25న మందలపర్రు సచివాలయాలు. **గణపవరం..** 22న గణపవరం జడ్పీ బాలుర, అర్ధవరం జడ్పీ బాలికోన్నత, పిప్పర జడ్పీ ఉన్నత పాఠశాలలు, అగ్రహారం గోపవరం, మొయ్యేరు సచివాలయాలు. 23న గణపవరం జడ్పీ బాలికోన్నత, కాశిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, జల్లికొమ్మర, పిప్పర-2, ముప్పర్తిపాడు సచివాలయాలు 24న గణపవరం-2, వల్లూరు, కొత్తపల్లి సచివాలయాలు, డి.కుముదవల్లి, కేశవరం జడ్పీ ఉన్నత పాఠశాలలు. 25న గణపవరం-4, ఎస్.కొండేపాడు, సరిపల్లి, అప్పన్నపేట, సీహెచ్ అగ్రహారం సచివాలయాలు.


జల్లికొమ్మరలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

పశు సంతతితో రైతులకు అదనపు ఆదాయం

గణపవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పశువుల సంతతి పెంపొందించి రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ఆదేశించారు. జల్లికొమ్మరలో రైతు భరోసా కేంద్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. పాడి పశువుల ఆరోగ్యంతో పాటు అవి క్రమం తప్పకుండా చూడి దాల్చినపుడు రైతుకు ఆదాయం సమకూరుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా స్కానింగ్ మెషీన్ ద్వారా పాడి పశువు కడుపులోని పిండాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. 123 పశువులను వైద్య నిపుణులు పరీక్షించారు. రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డి.ఎం.నాయక్, ఎంపీడీవో శ్రీలక్ష్మి, వీపీ మణికంఠ రాజేష్, కూటమి నాయకులు కవల రాంబాబు, తోట శ్రీను, యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల విధుల బహిష్కరణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విధులను బహిష్కరించారు. రెండేళ్ల నుంచి పీఎఫ్ జమకావడం లేదని, అయిదు నెలల నుంచి జీతాలు లేవని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పాటు జిల్లా వ్యాప్తంగా 222 మంది కార్మికులు పని చేస్తున్నారని, వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే నవంబరు ఒకటి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు.

పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలి: గన్ని

భీమడోలు, న్యూస్‌టుడే: అర్హత కలిగిన పట్టభద్రులందరిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కూటమి నాయకులంతా కృషి చేయాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి తెదేపా క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు పట్టభద్రుల ఓటర్ల నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉండవల్లి బాలానందం మాట్లాడుతూ గ్రామాల్లో 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారి వివరాలు సేకరించడంతో పాటు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు దరఖాస్తు చేయించాలన్నారు. తెదేపా నాయకులు శిరిబత్తిన కొండబాబు, దూసనపూడి పుల్లయ్యనాయుడు, కరణం పెద్దిరాజు, ముత్యాల స్వామి, సత్తినీడి నాని, సంబంగి రంగారావు, అడ్డగర్ల వెంకటరత్నం, పైడిమాల యుగంధర్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరాంజనేయులు

ఆక్రమణలు తొలగించాలని వినతి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పైనుంచి గణపవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా నారాయణపురంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని అదే గ్రామానికి చెందిన న్యాయవాది తల్లిబోయిన రాజేష్ ఉంగుటూరులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు వై.పూర్ణచంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. రహదారిని ఇరువైపులా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని తెలిపారు. అక్రమ కట్టడాలకు విద్యుత్తు శాఖ అధికారులు కనెక్షన్లు ఎలా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పల్లె పండగతో ప్రగతి: చింతమనేని

దుగ్గిరాల (పెదవేగి), న్యూస్‌టుడే: పల్లె పండగతో ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో రూ.40 లక్షలతో చేపట్టే సీసీ రహదారుల నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైకాపా పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలేశారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.. పెదపాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో అమిల్‌జమ, తహసీల్దారు కృష్ణజ్యోతి, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో సూర్యకుమార్, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, తెదేపా ఏలూరు పార్లమెంటు కార్యదర్శి గుత్తా అనిల్, పెదపాడు మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభాకర్

ఎమ్మెల్యే వస్తున్నారని...

పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వస్తున్నారన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత అయిదేళ్లుగా తహసీల్దారు కార్యాలయ ఆవరణ వర్షం కురిసినప్పుడు మునిగిపోయేది. నీరు పోయినా ఆవరణ బురదగా ఉండేది. గత అయిదేళ్లూ పట్టించుకోని అధికారులు.. ఎమ్మెల్యే వస్తున్నారన్న సమాచారంతో సోమవారం ఉదయం హడావుడిగా గ్రావెల్ తెప్పించి ఆవరణను బాగు చేశారు. దీనిపై తహసీల్దారు కార్యాలయం, గ్రామ సచివాలయం, పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు ఆయా కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడ్డామని, ఇప్పుడు ఆ అవస్థ తప్పిందని చెబుతున్నారు.


ఆవరణలో పోసిన గ్రావెల్

29న ముఖ్య కార్యకర్తల సమావేశం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న ఏలూరులోని వైఎంహెచ్‌ఏ హాలులో ఏలూరు నగర, పంచాయతీ, గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు.

అడ్డదారిలో అడ్‌హక్ పదోన్నతులు!

★ నిబంధనలు బేఖాతరు చేస్తూ రంగం సిద్ధం ★ నగర పాలికలో ఇదీ పరిస్థితి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

అడ్డదారిలో అడ్‌హక్ పదోన్నతులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో ఈ పదోన్నతులు చెల్లవంటూ నిలుపుదల చేశారు. వారికి రివర్షన్ ఇవ్వాలని ఆదేశించారు. అయినా మళ్లీ పదోన్నతుల ప్రక్రియను తెరమీదకు తీసుకొచ్చి హడావుడిగా అడ్‌హక్ పేరుతో ఇచ్చేందుకు దస్త్రం సిద్ధం చేశారు. ఏలూరు నగర పాలక సంస్థలో ఈ వ్యవహారం తాజాగా చోటు చేసుకుంది.

ఏలూరు నగర పాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న తొమ్మిది మందికి వైకాపా పాలనలో 2022 మార్చిలో డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించారు. హెవీ డ్రైవింగ్ లైసెన్సు వచ్చాక మూడేళ్ల సీనియార్టీ ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించాలి. కానీ అందుకు విరుద్ధంగా జరగడంతో కొందరు ఈ విషయాన్ని విజిలెన్స్, సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు అర్హత కలిగిన ముగ్గురిని కొనసాగించి, మిగిలిన ఆరుగురికి రివర్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా హెవీ డ్రైవింగ్ లైసెన్సు ఉండి సీనియార్టీ ఉన్న మరో పారిశుద్ధ్య కార్మికుడికి పదోన్నతి అవకాశం కల్పించాల్సి ఉన్నా అతన్ని పక్కనబెట్టారు. పదోన్నతుల విషయంలో అర్హత లేకున్నా ఇచ్చేందుకు సిద్ధపడటం వెనుక ఆర్థిక లావాదేవీలున్నట్లు తెలిసింది. తాజాగా రివర్షన్ ఇవ్వాల్సిన ఆరుగురికి పదోన్నతులు కల్పించేందుకు సిద్ధపడుతున్నారు. ఈ విషయం తెలిసిన పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అర్హతలేని వారికి అడ్‌హక్ పేరుతో ఎలా అవకాశం కల్పిస్తారని, ఇప్పుడంత అవసరం ఏమి వచ్చిందని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పోలీసు అమరులకు వందనం


పెదవేగిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పెదవేగి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసులు సోమవారం పెదవేగిలో విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. సీఐ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను అందరూ జ్ఞాపకం ఉంచుకోవాలన్నారు. పెదవేగి పోలీసు స్టేషన్ నుంచి పెదవేగి కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. ఎస్సై కె.రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రులో ఎస్సై వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు. అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు పోలీసు స్టేషన్ వద్ద నుంచి ఉన్నత, మానస పాఠశాలలు, శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. వినాయక చవితి నిమజ్జనోత్సవాల్లో ఆగిరిపల్లిలో జరిగిన ఘటనలో చనిపోయిన కానిస్టేబుల్ గంధం నరేంద్రకు నివాళి అర్పించారు. ఎస్సై వై.సుధాకర్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది సోమవారం కళాశాల నుంచి పోలీస్ ఐలాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను ఎస్సై మణికుమార్ గుర్తు చేసుకున్నారు. అనంతరం పోలీస్ ఐలాండ్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నారాయణపురంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.


భీమడోలులో..


గణపవరం పోలీస్ ఐలాండ్ కూడలి వద్ద మానవహారం

చర్మవ్యాధులు, చికిత్సపై అవగాహన

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో సోమవారం చర్మవాధులు, నూతన చికిత్సా విధానంపై చర్చా వేదిక నిర్వహించారు. వైద్య విద్యార్థులకు చర్మవాధుల శస్త్ర చికిత్సలపై అవగాహన కల్పించారు. అవగాహన సదస్సుకు 176 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. చికిత్స విధానం, బొల్లి వ్యాధులకు చికిత్స, పుట్టుమచ్చలు తీసివేయడం, చర్మంపై ఏర్పడే కంతులను తొలగించడం తదితర అంశాలపై ఆశ్రం ఆసుపత్రి శస్త్ర చికిత్స నిపుణులు అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ కార్యక్రమంలో ఆశ్రం వైద్య కళాశాల ప్రిన్సిపల్ చేబ్రోలు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాలరాజు, పర్యవేక్షకులు డాక్టర్ శాంతయ్య, గ్రూపు సీవోవో రాజరాజన్, సీఈవో డాక్టర్ హనుమంతురావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చేబ్రోలు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ దేవకీరాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా స్థాయిలో మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తున్నారని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని హబీబ్ బాషా తెలిపారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న హబీబ్ బాషా

మహిళల ఆర్థిక స్వావలంబనే కూటమి లక్ష్యం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాళ్లను ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగి జీవనోపాధి పొందాలని ఆకాంక్షించారు. సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ వినియోగదారులు డ్వాక్రా ఉత్పత్తులు కొనుగోలు చేసి సంఘాలకు ఆసరాగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ పెదబాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బి.ఝాన్సీరాణి, కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉత్పత్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్

కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేశ అభివృద్ధిలో కీలకంగా ఉన్న నిర్మాణ రంగంలో పని చేస్తున్న కోట్ల మంది కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏపీ భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర కార్యశాల రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి.. 1996 జాతీయ నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని, 1979 వలస కార్మికుల చట్టాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత అయిదేళ్లలో రాష్ట్రంలోని నిర్మాణ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, కోశాధికారి కేవీ గోపాలరావు, పిల్లి నరసింహారావు, సుందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిబాబా

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	లవ్ రెడ్డి
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఇద్దరు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	డీల్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విశ్వం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక అన్నే భవనంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై వారు సోమవారం మాట్లాడారు. రైతులు పంట పండించడానికంటే అమ్ముకోవడానికే ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవడానికి ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో లేక అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందన్నారు. టార్పాలిన్లు రాయితీపై అందించాలని, పంట నిల్వ చేసుకునే షెడ్లు నిర్మించాలని కోరారు. పంట సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లతోనే ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ-పంటలోని పేర్లనే నమోదు చేయాలని కోరారు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో సొమ్ము చెల్లించేలా నిధులు కేటాయించాలని, రవాణకు రైతుల ఎడ్లబండ్లకు అనుమతించాలని కోరారు.

జీపీఎఫ్ ఖాతాలు తెరవాలి: ఏపీటీఎఫ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. నగరంలోని సుబ్బమ్మదేవి పాఠశాలలో సోమవారం నిర్వహించిన సంఘ నగర శాఖ సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు రత్నకుమార్ మాట్లాడుతూ పురపాలక బడుల్లో స్కూలు అసిస్టెంట్ కొలువులు మంజూరు చేయాలన్నారు. జిల్లా కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పని సర్దుబాటు విధానాన్ని రద్దు చేయాలన్నారు. నాయకులు ఆనంద్‌కుమార్, శాంతికుమార్, పి.రోజా, కె.పొట్టియ్య, ఎ.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ 14వ రోడ్డుకు చెందిన పిల్లా దుర్గాప్రసాద్ (22) ఓ నూడిల్స్ దుకాణంలో పని చేస్తుంటాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఇటీవల అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురై ఆదివారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

పరమటమ్మ ఆలయ, విగ్రహ పునఃప్రతిష్ఠ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు కొత్తపేట పాత నీళ్ల ట్యాంకు ప్రాంగణంలోని పరమటమ్మ (గునాలమ్మ) ఆలయ, విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు చేశారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో కోలాటం, నృత్య ప్రదర్శనల నడుమ 108 మంది మహిళలు 108 రకాల సారెతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే బడేటి చంటి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



మహాన్న ప్రసాద వితరణ.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నల్లదిబ్బలోని మహిషాసురమర్దని, కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం మహాన్న ప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

గిరిజన ఉత్పత్తుల తయారీపై అవగాహన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాల్లో వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా ఆదివాసీ గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులు, వాటి మార్కెటింగ్‌కు సహాయ సహకారాలు అందించనున్నట్లు డ్రీమ్స్ డే సొల్యూషన్స్ కన్సల్టెన్సీ సంస్థ(హైదరాబాద్) వ్యవస్థాపకులు శ్వేత, నిఖిల్ తెలిపారు. బుట్టాయగూడెంలో జీసీసీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అరకు కాఫీ హబ్, సూపర్ బజార్‌ను సోమవారం సందర్శించారు. ఇక్కడ విక్రయిస్తున్న జీసీసీ ఉత్పత్తులపై డివిజినల్ మేనేజర్ పార్వతీశ్వరరావు వివరించారు. జేసీ ధాత్రిరెడ్డి సూచనల మేరకు మన్యంలో ఏర్పాటు చేస్తున్న వన్‌ధన్ వికాస కేంద్రాలు పరిశీలించామని శ్వేత తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న కారం మిల్లును పరిశీలించారు.

గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని మన్యం మండలాల నుంచి మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యాన ఉచిత శిక్షణనిస్తున్నట్లు జేసీ, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో ధాత్రిరెడ్డి తెలిపారు. ఔత్సాహికులు జ్ఞానభూమి పోర్టల్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సభల విజయవంతానికి పిలుపు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈ నెల 24న, విజయవాడలో నవంబరు 5న నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బన్నే వినోద్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ప్రచార గోడపత్రికలు ఆవిష్కరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

పోలవరం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. నిర్ణీత సమయానికి హాజరు వేయాలని, దస్త్రాలు పక్కాగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అప్పగించిన పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలను పదిహేను రోజులకోసారి శుభ్రం చేయించాలని, రోడ్ల పక్కన చెత్తాచెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్తు ఈఈ బాధ్యతల స్వీకరణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్తు ఈఈగా పీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరులో పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. జంగారెడ్డిగూడెంలో విధులు నిర్వర్తిస్తున్న రాధాకృష్ణ ఏలూరు సర్కిల్ కార్యాలయం టెక్నికల్ ఈఈగా బదిలీ అయ్యారు.



అహ్మద్‌ఖాన్

2న లక్ష దీపోత్సవం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానికంగా ఓ కల్యాణ మండపంలో నవంబరు 2న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు, శ్రీకృష్ణ పురందర దాస భజన మండలి సంయుక్త ఆధ్వర్యాన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు తెదేపా నాయకుడు రాజాన సత్యనారాయణ, పురందర దాస భజన మండలి సభ్యులు సోమవారం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. లక్ష దీపోత్సవంలో పాల్గొనే భక్తులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

జంగారెడ్డిగూడెం: మద్ది గ్రామంలో కార్తిక మాస ఉత్సవాల నిర్వహణకు అన్నిశాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని ఆలయ ఈవో ఆర్వీ చందన కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్తు, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొని ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.


గొలుసుకట్టు.. కనికట్టు!

గ్రామాల్లో అనధికార మద్యం అమ్మకాలు

యథేచ్ఛగా దుకాణాల ఏర్పాటు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే

జీలుగుమిల్లి మండలంలో మద్యం ఏరులై పారుతోంది. ప్రతి గ్రామంలోనూ అమ్మకాలు జోరందుకుంది. ప్రధాన మద్యం దుకాణాలను తలదన్నేలా.. పల్లెల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. యథేచ్ఛగా అనధికార మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యాపారం సాగిస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలో రెండు మద్యం దుకాణాలకు ప్రభుత్వం లాటరీ ప్రక్రియ నిర్వహించింది. అయిదు రోజుల కిందట ఒక దానికి ప్రారంభించగా- మరొకటి వివాదంలో చిక్కుకొని నిలిచింది. ప్రస్తుత దుకాణానికి అనుసంధానంగా పలు గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేశారు.



పి.అంకంపాలెంలో మద్యం సీసాలు

ఓ నేత అండదండ

పి.అంకంపాలెం, ములగలంపల్లి, రౌతుగూడెం, టి.గంగన్నగూడెం, దర్భగూడెం, కామయ్యపాలెం, పి.రాజవరం గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఓ నేత అండదండలతో లక్షలాది రూపాయలు చెల్లించి అనధికారికంగా గొలుసు దుకాణాలు దక్కించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటలపాటు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల గ్రామ నడిబొడ్డున మద్యం విక్రయిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ములగలంపల్లి శివారులో గొలుసు దుకాణం

రూ.10 నుంచి రూ.40 వరకు..

గొలుసు దుకాణాల్లో ఒక్కో సీసాకు రూ.10 నుంచి రూ.40 వరకు అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు మండలం కావడంతో.. జోరుగా వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయి. గొలుసు దుకాణాల వద్ద మందుబాబులు నానా హడావుడి చేస్తున్నారు. ఆయా మార్గాల్లో బాలికలు, యువతులు, మహిళలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. 'గ్రామాల్లో గొలుసు దుకాణాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతుల్లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం' అని ఎక్సైజ్ ఎస్సై సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.

10 AM to 1 PM మీ సమస్యా.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం : 80085 74947
చింతలపూడి : 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీని ఆనుకుని చెత్తాచెదారాలు పడేస్తున్నారు. సీహెచ్‌సీ పరిసరాలు అపరిశుభ్రంగా తయారై దుర్వాసన వస్తోంది. ప్రహరీ పొడవునా చెత్త, ఇతర వ్యర్థాలు పడేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.
- పి.వి.రాఘవులు, గణేశ్‌నగర్

సమాధానం: సీహెచ్‌సీ ప్రహరీని ఆనుకొని పేరుకుపోయిన చెత్త తొలగిస్తాం. ఇకపై ఎవరూ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం.
- కె.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: రేవర్ల బీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మించలేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రహదారులు నిర్మించాలి.
- నాగేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: మండలంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశాం. రేవర్ల కాలనీలోనూ సిమెంట్ రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
- మురళీకృష్ణ, ఎంపీడీవో, చింతలపూడి

తుప్పల తొలగింపు..

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడు- కచ్చప్పగూడెం మార్గంలో రహదారి పక్కనున్న విద్యుత్తు పరివర్తకానికి అల్లుకుపోయిన తుప్పలను సిబ్బంది తొలగించారు. 'దారి పక్కనే ఉన్నా కనపడదా?' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ ఎస్.వి.రామారావు స్పందించారు. సిబ్బందిని పంపి తుప్పలు తొలగించి సమస్య పరిష్కరించారు.

పోలీసుల సేవలు అజరామరం

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినం

పోలవరం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సంరక్షణలో పోలీసులు ఎన్నో త్యాగాలు చేశారని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సోమవారం పోలీసులు ప్రదర్శన చేపట్టారు. ఏటిగట్టు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అమరులైన పోలీసులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ బాలసురేశ్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణం: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. పట్టణంలో ఎస్సై జబీర్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణ ప్రధాన రహదారుల మీదుగా బోసు బొమ్మ కూడలి వరకు ర్యాలీ సాగింది. ఎస్సైలు రామకృష్ణ, చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: పట్టణంలో సీఐ రవీంద్ర ఆధ్వర్యాన పాతబస్టాండు నుంచి అగ్నిమాపక కేంద్రం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఎస్సై కుటుంబరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుట్టాయగూడెంలో ర్యాలీ చేపట్టారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు, సిబ్బంది, వివిధ నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్సై నవీన్ కుమార్ అన్నారు. జీలుగుమిల్లి పాఠశాల విద్యార్థులతో కలిసి సోమవారం ప్రదర్శన నిర్వహించారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో భీమడోలు సీఐ విల్సన్, స్థానిక ఎస్సై సుధీర్ ఆధ్వర్యాన గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గరుడ బొమ్మ కూడలి వరకు ప్రదర్శన సాగింది. ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు.

కుక్కునూరు: స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు పోలీసులు, విద్యార్థులు ప్రదర్శన చేశారు. సీఐ రమేశ్‌కుమార్, ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలో పాలుపంచుకున్నారు.

వేలేరుపాడు: స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు పోలీసులు ప్రదర్శన చేశారు. ఎస్సై కేవీ రామారావు ఆధ్వర్యంలో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.



పోలవరం: ఏటిగట్టు కూడలిలో మానవహారం



జంగారెడ్డిగూడెం: విద్యార్థులు, పోలీసుల ర్యాలీ



లింగపాలెం: భూమి పూజ చేస్తున్న సర్పంచి

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా నిర్మిస్తున్న సిమెంటు రహదారుల్లో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేయాలని పంచాయతీరాజ్ డీఈ సీతయ్య సూచించారు. పి.రాజవరంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని పన్నెండు పంచాయతీల్లో మొత్తం రూ.6 కోట్లతో సీసీ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పలు గ్రామాల్లో మురుగు కాలువల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ రామానుజం, ఇంజినీరింగ్ సహాయకులు హేమంత్, అశోక్ ఉన్నారు.

లింగపాలెం: కొత్తపల్లిలో ఉపాధిహామీ నిధులు రూ.12 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి సర్పంచి గుర్రాల కృష్ణకుమారి సోమవారం భూమి పూజ చేశారు. నాయకులు శాఖమూడి శ్రీను, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

4 గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. బయ్యనగూడెం-1, పరింపూడి-1, యర్రంపేట-1, దిప్పకాయలపాడు సచివాలయాల్లో శిబిరాలు కొనసాగుతున్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులంతా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని తెదేపా మండలాధ్యక్షుడు పారెపల్లి నరేశ్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని వివిధ విద్యాసంస్థల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి నల్లూరి గోపి, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గురవాయిగూడెం అయ్యప్ప ఆలయంలో దీక్షాధారులకు రోజూ మధ్యాహ్నం పూట ఉచిత అన్నప్రసాద వితరణ కొనసాగుతోంది. పదో రోజైన సోమవారం వందలాది మంది అయ్యప్ప స్వాములకు భిక్ష అందించారు. .



విద్యార్థుల సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై వ్యాసరచన పోటీలు జరిగాయి. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పి.యశస్వి ప్రథమ, వెలగ ఐశ్వర్యశ్రీ ద్వితీయ, ఒబిలిశెట్టి సాత్విక ఆనంది తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి విద్యాసంస్థల ఏవో ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో దాగున్న సృజనను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు దిలీప్‌కుమార్, వరప్రసాద్, దినేశ్, శంకర్ తదితరులు పర్యవేక్షించారు.

'మీ కోసం'కు స్పందన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీ కోసం'కు స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి ఆర్డీవో అద్దయ్యకు అర్జీలు సమర్పించారు. పేరంపేటలో నీటి సమస్య పరిష్కరించాలని కలపాల వెంకటేశ్ వినతి ఇచ్చారు. తమ భూములకు రక్షణ కల్పించాలని సీతప్పగూడెం రైతు రఘు రాంబాబు, జంగారెడ్డిగూడేనికి చెందిన లక్ష్మీజ్యోతి వేర్వేరుగా అర్జీలు సమర్పించారు. కామవరపుకోటలోని గిడ్డంగులకు బహిరంగ వేలం వేసి పాటదారులకు అప్పగించాలని నరెడ్ల దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



జంగారెడ్డిగూడెం: అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

ఐటీడీఏలో 12 అర్జీలు.. బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక- మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీనుకుమార్, పరిపాలనాధికారి రామారావు తదితరులు పాల్గొని వినతులు స్వీకరించారు. మొత్తం 12 అర్జీలు అందినట్లు వారు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

వేలేరుపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న సామాజిక ఆరోగ్యాధికారుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ ఆరోగ్య ఉద్యోగ సంఘం నాయకుడు సున్నం శ్రీరాములు డిమాండ్ చేశారు. వేలేరుపాడులో సోమవారం సంఘ సమావేశం నిర్వహించారు. శ్రీరాములు అధ్యక్షత వహించి మాట్లాడారు.

నేడు కొమరం భీం జయంతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏలో మంగళవారం ఆదివాసీ యోధుడు కొమరం భీం, ఆదివాసీల ఆత్మబంధువు ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. కె.అంకంపాలెంలో సోమవారం సంఘం సమావేశం నిర్వహించారు.

బయ్యనగూడెం వాసికి పురస్కారం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడేనికి చెందిన రైతు సుంకర సత్తిరాజును రైతు నేస్తం పురస్కారం వరించింది.



ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణభారత్ ట్రస్టు, రైతు నేస్తం సంయుక్త ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. పూర్వపు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20వ తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర నిర్వహించారు. పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజు రాసిన 'నా సిరాచుక్క ఎదురుచూస్తోంది' కవితకు పురస్కారం దక్కింది. ఆయన్ను పలువురు అభినందించి సత్కరించారు.



వెంకట్‌లాల్‌కు ప్రతిభా అవార్డు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు జి.వెంకట్‌లాల్ అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఇటీవల గుంటూరులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతులమీదుగా పురస్కారం స్వీకరించారు.



వీరబ్రహ్మంకు ఆంధ్రరత్న..

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడికి చెందిన శిల్పి వీరబ్రహ్మంకు అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 'ఆంధ్రరత్న' అవార్డుతో సోమవారం సత్కరించింది. తెలుగు సాంస్కృతిక మహోత్సవం పేరిట విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందజేసింది.



హక్కులు కాపాడుకుందామని తీర్మానం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మాదిగలు తమ హక్కులను కాపాడుకోవాలని, ఇందుకు ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. గుణ్ణంపల్లిలో గ్రామ స్థాయి మాదిగల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. తమ కాలనీల్లోని ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. శ్మశానవాటిక అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం, ద్వారకాతిరుమలలో మాదిగల సామాజిక భవన నిర్మాణానికి స్థలం, నిధుల కేటాయింపు తదితరాలపై చర్చించారు. సంఘ నాయకులు వవ్వలపు వెంకటేశ్వరరావు, కె.గాంధీ, అశోక్, చరణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఖాళీలు భర్తీ చేయాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆదివాసీ వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేశ్వరరావు కోరారు. ఏలూరులో డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఆపై స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మన్యం ప్రాంతంలో జీవో నంబరు 68 ప్రకారం ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల్లో ఎవరైనా మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సువర్ణ, జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాములు, ఉపాధ్యక్షురాలు పోశమ్మ, ప్రధాన కార్యదర్శి వెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శర్మిష్ఠకు మొక్క ఇస్తున్న నాయకులు

మరుగుదొడ్లు లేక... బయటకెళ్లలేక!

రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్న రోగులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. రోజూ వంద మందికి పైగా రోగులొచ్చే ఆసుపత్రిలో రెండేళ్లుగా మరుగుదొడ్లు లేవు. ఫలితంగా రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2022లో సంభవించిన గోదావరి వరదకు ప్రభుత్వాసుపత్రి భవనం దెబ్బతింది. దాంతో సాంఘిక సంక్షేమ వసతి గృహంలోకి మార్పు చేశారు. అప్పట్నుంచి మరుగుదొడ్లు శిథిలావస్థలోనే ఉన్నాయి. వాటి చుట్టూ దట్టమైన పొదలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. దాంతో బాలింతలు, గర్భిణులు అటు వైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు.



ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మూత్ర పరీక్షలకు ఇబ్బందులు

ముఖ్యంగా మహిళలు మూత్ర పరీక్ష చేయించుకునేందుకు తుప్పల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో అత్యధికులు గిరిజనులే నివసిస్తుండగా- వారు ప్రైవేట్ ఆసుపత్రులకెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేదు. ఫలితంగా అరకొర వసతులున్న పీహెచ్‌సీ బాట పడుతున్నారు. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలోని మరుగుదొడ్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు నిధులు మంజూరు చేస్తే నూతన మరుగుదొడ్లు నిర్మించడమా.. పాత బాగు చేయించడమో చేస్తాం' అని కేఆర్‌పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్ తెలిపారు.



జంగారెడ్డిగూడెం: నినాదాలు చేస్తున్న కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అయిదు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రాంతీయాసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఆసుపత్రి ఎదుట ఏఐటీయూసీ నాయకులతో కలిసి రెండో రోజు సోమవారం నిరసన చేపట్టారు. గుత్తేదారు తమ జీతంలో పీఎఫ్, ఈఎస్ఐ పేరిట తీసుకున్న నగదును ఆయా ఖాతాల్లో జమ చేయలేదని ఆరోపించారు. గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బుట్టాయగూడెం: వేతన బకాయిలు చెల్లించి, తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని బుట్టాయగూడెం సీహెచ్‌సీ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఆసుపత్రి ఎదుట సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. వీరికి వైద్యులు, సిబ్బంది మద్దతు తెలిపారు.

చింతలపూడి పట్టణం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పారిశుద్ధ్య కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. సంఘ నాయకురాలు మరియమ్మ మాట్లాడుతూ.. తమకు వేతన బకాయిలు చెల్లించడంతో పాటు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

కారు అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

చాట్రాయి, న్యూస్‌టుడే: సత్తుపల్లి-విజయవాడ రాష్ట్రీయ రహదారి సూరంపాలెంలో ఆదివారం అర్ధరాత్రి కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. చింతలపూడి మండలం ఎర్రంపల్లికి చెందిన గోలి వెంకటేశ్వరరెడ్డి బంధువులతో కలిసి కారులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా సూరంపాలెంలోని మలుపులో కారు అదుపు తప్పి పక్కనున్న డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. కారు నడుపుతున్న గోలి వెంకటేశ్వరరెడ్డి, మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై డి.రామకృష్ణ వెంటనే ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఆయన తెలిపారు.



ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కప్పలకుంట వద్ద జాతీయ రహదారిపై సోమవారం ప్రమాదం సంభవించింది. స్థానికుల కథనం మేరకు.. భీమడోలు నుంచి నల్లజర్ల వైపు వెళ్తున్న లారీ కుప్పలకుంట వద్ద రహదారి పక్కన ఆగి ఉంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అనంతపల్లి టోల్ ప్లాజా ఇన్‌ఛార్జి ప్రశాంత్ వెనుక నుంచి లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మోసంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అక్కంపేటకు చెందిన గూడుపు రామకృష్ణకు తండ్రి నుంచి సంక్రమించిన 0.33 సెంట్ల వ్యవసాయ పొలముంది. భూమిని తన పేరుపై మార్పు చేసి, పాసుపుస్తకం ఇచ్చేందుకు అదే గ్రామానికి చెందిన మధ్యవర్తి తారిపి రెడ్డి బాలాజీకి భూమి ఒరిజినల్ పత్రాలు, కొంత నగదు ఇచ్చారు. రోజులు గడుస్తున్నా పాసుపుస్తకం చేయించకపోవడంతో బాలాజీని నిలదీశారు. రామకృష్ణపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పోలవరంలో కుండపోత వర్షం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో జడివాన పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు సతమతం కాగా, సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

సారా విక్రేత అరెస్టు

కుక్కునూరు, న్యూస్‌టుడే: వేలేరులో సారా విక్రయిస్తున్న నున్నావత్ సురేశ్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గ్రామంలో దాడులు చేశామన్నారు. సురేశ్‌కుమార్ వద్ద సారా లభించడంతో.. ఆయన్ను అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు చెప్పారు. మండలంలో ఎవరైనా సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

నయనానందకరం శ్యామలాంబ గ్రామోత్సవం



కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో చండీ మహాయాగ సహిత శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన తరుణంలో సోమవారం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై గ్రామంలో ఊరేగించారు. శక్తి వేషధారణలు, దేవతామూర్తుల అవతారంలో భక్తులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించగా.. 121 రోజులకు గానూ రూ.9,07,104 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కె.శ్రీనివాస్ తెలిపారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ముసునూరు, న్యూస్‌టుడే: ఆధార్‌లో నివాసం, పేర్లు తదితర మార్పు, చేర్పులకు ముసునూరు మండలంలో ఈనెల 22 నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాణి సోమవారం తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో రమణక్కపేటలో, 24, 25 తేదీల్లో చెక్కపల్లి గ్రామ సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు ఈనెల 22, 23 తేదీల్లో ఆగిరిపల్లి సచివాలయం, 24, 25 తేదీల్లో ఈదర గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి. భార్గవి తెలిపారు. వేలిముద్రల నవీకరణతో పాటు ఇతర ఆధార్ సమస్యల పరిష్కారానికి ఇవి దోహదపడతాయన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ


వీరభద్రరావు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి ఎస్సైగా వీరభద్రరావు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. మండలంలోని సింగరాయపాలెం- చేవూరుపాలెం కూడలిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలకు వితరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: మర్లపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కరెంటు సరఫరా ఉన్నా పూర్తి స్థాయిలో అన్ని గదులకు అందుబాటులో లేదు. దీంతో పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు తిరుపతయ్య సొంత నిధులతో అన్ని గదులకు విద్యుత్తు సరఫరాకు అవసరమైన పరికరాలను హెచ్‌ఎం బక్కయ్యకు సోమవారం అందజేశారు.

బడి భవనం భయానకం!

★ పెచ్చులూడుతున్న పైకప్పులు ★ గాయాలపాలవుతున్న చిన్నారులు

మండవల్లి, న్యూస్‌టుడే

బడి పిల్లలకు భద్రత కరవైంది. నాడు- నేడు కార్యక్రమంలో రూ.కోట్లు వెచ్చించి బడులను ఆధునికీకరించామని డప్పులు కొట్టుకున్న వైకాపా సర్కారు కూలడానికి సిద్ధంగా ఉన్న బడి భవనాలకు నిధులు మంజూరు చేయలేదు. నిధులు మంజూరు చేసిన చోట్ల పనులు పూర్తి చేయలేకపోయింది. ఫలితంగా బడి భవనాలు భయానకంగా మారాయి. ఇటీవల మండవల్లి మండలంలోని ఓ గ్రామంలో పాఠశాల భవనం పైకప్పు విరిగిపడి.. బాలిక తలకు తీవ్ర గాయాలైన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇలాంటి భవనాలు నియోజకవర్గంలో అనేకచోట్ల ఉన్నాయి.

అయినా అందులోనే..



మండవల్లి మండలం చింతపాడు జడ్పీ ఉన్నత పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి ఇటీవల ఓ బాలిక తలకు తీవ్రంగా గాయమైంది. ఈ బడి భవనం శిథిలమైందని, ప్రమాదకరమని అధికారులు మూడేళ్ల కిందటే ధ్రువీకరించారు. నూతన భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. నిర్మాణంలో జాప్యం కారణంగా ఆ పనులు పూర్తి కాలేదు. దీంతో కూల్చి వేయాల్సిన భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అవి కాస్త పెచ్చులూడి ఇటీవల బాలికకు తీవ్ర గాయాలు కావడంతో చిన్నారులు, వాళ్ల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ..



కలిదిండి మండలం మూలలంక పంచాయతీ శివారు చినపుట్లపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి చాలా కాలమైంది. ఈ బడిలో 20 మందికిపైగా చిన్నారులున్నారు. రెండేళ్లుగా వర్షాలు పడినప్పుడు బడి సమీపంలోనున్న చర్చిలో తలదాచుకుంటున్నారు. 1, 2 విడతల్లో నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మూడో విడతలోనైనా నిధులిస్తారా? లేదా? అని ఆ చిన్నారులు ఎదురుచూస్తున్నారు. ప్రమాదం సంభవించకముందే సురక్షిత ప్రదేశంలో తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

డివిజన్‌లో నాడు- నేడు రెండో విడతలో మంజూరైన భవన నిర్మాణాల పనులు త్వరలోనే పూర్తి చేయిస్తాం. చినపుట్లపూడి పాఠశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించి మూడో విడతలో నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటాం. చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తామని ఏలూరు డీవైఈవో రవిప్రకాశ్ వివరించారు.

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించండి: ఆర్డీవో


అర్జీ స్వీకరిస్తున్న వాణి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నిర్దేశిత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని వివిధ శాఖలకు చెందిన అధికారులను ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. అందులో 10 అర్జీలొచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. పరిష్కారం కానీ సమస్యలను అర్జీదారులకు వివరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :	99486 40551	కైకలూరు:	73060 88555
ముసునూరు :	93983 81268	కలిదిండి:	90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని నరసాయపాలెం ఎంపీపీ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతోంది. విద్యార్థులతో పాటు స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.
- శివకృష్ణ, గ్రామస్థుడు

సమాధానం: డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగు నీరు మళ్లించేలా చర్యలు చేపడతాం. **- రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: ముసునూరు నుంచి వలసపల్లి వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. అటుగా ప్రయాణించే వాహనదారులు భారీ వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు తప్పుకొనేందుకు వీలు ఉండటం లేదు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలి.
- పి.శ్రీనివాసరావు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- బాబూరావు, ఆర్‌అండ్‌బీ డీఈ

ఉత్సాహంగా ముందుకొచ్చి.. ప్రతిభ చాటి!

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జి.జయనాగశ్రీ, ఆర్.లోహిత, కె.రంజిత్‌కుమార్‌లకు పాఠశాల ప్రిన్సిపల్ జీవరత్నం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలను ఉపాధ్యాయులు వి.మీనాక్షి, పి.కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.


సెయింట్ మేరిస్ పాఠశాలలో విజేతలతో ఉపాధ్యాయులు


సెయింట్ థామస్ పాఠశాలలో..

★ నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలను ఉపాధ్యాయులు బండి రుక్మిణీ ప్రసన్న, నత్త యేసు, కాసర్ల అనురాధ, పెనుముచ్చు రవీంద్ర, మోచర్ల సురేశ్, గరికపాటి జ్యోతి పర్యవేక్షించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు సూదుల నిస్సీ వాసల్య, జి.జ్ఞానేంద్ర, ఎం.బ్లేసీ షాలేమ్‌లకు పాఠశాల ప్రిన్సిపల్ చిన్నపరెడ్డి బహుమతులు అందజేశారు.

సంస్థాగతంగా భాజపా బలోపేతం: కామినేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో భాజపాని బలోపేతం చేసే దిశగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం నూజివీడులో భాజపా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిశోర్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కామినేని మాట్లాడుతూ. . ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. నూజివీడు నియోజకవర్గం సభ్యత్వ నమోదులో నాలుగో స్థానంలో ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బోను అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు: ఎంపీడీవో

కైకలూరు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల్లో ఏ శాఖ పనిని ఆ శాఖ ఉద్యోగులు మాత్రమే నిర్వర్తించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అర్హత కలిగిన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ వి.కొండలరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వినికిడి యంత్రాలకు నమోదు చేసుకోండి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చెవుడు నివారణ కార్యక్రమంలో భాగంగా వినికిడి సమస్య, చెవుడు ఉన్నవారికి వినికిడి మిషన్లు ఉచితంగా అందజేస్తుందని, దానికి అర్హులైన వారు తగిన పత్రాలతో నూజివీడు ఏరియా ఆసుపత్రిలో నమోదు చేసుకోవాలని ఆర్బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.నరేంద్ర కృష్ణ సోమవారం తెలిపారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి


ఫారం-18 అందజేస్తున్న తెదేపా నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ కోరారు. సోమవారం ముసునూరు మండలం గుడిపాడులో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె రఘుబాబు, కొల్లి గంగారాం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఫారం-18లను పంపిణీ చేశారు. అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ బాధ్యత తీసుకొని అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండలపు బుజ్జి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సరిదిద్దేందుకే గ్రామ సభలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భూ రీ సర్వేలో జరిగిన లోపాలు, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల సర్వేయర్ రాజశేఖర్ అన్నారు. కోమర్రు, ముదినేపల్లి, బొమ్మినంపాడులో సోమవారం భూ రీ సర్వే గ్రామ సభలు నిర్వహించారు. సమస్యలను రైతులు గ్రామసభ దృష్టికి తీసుకువస్తే వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం పలువురు వినతిపత్రాలు అందించారు. వీఆర్వో ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

విజయవాడ (పాయకాపురం, మధురానగర్), న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం నున్న సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వీరిద్దరి ఇంటి పేర్లు ఒకటే కావడంతో.. బంధువులు అయి ఉంటారని స్థానికులు భావించారు. కానీ.. ఒకరితో ఒకరికి సంబంధమే లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి సెంటరుకు చెందిన సుంకర సాంబశివరావు (53) వంట మేస్త్రిగా పని చేస్తున్నారు. ఎక్కడైనా వంట పని ఉంటే ఆటోలో వెళుతుంటారు. సోమవారం ఉదయం గన్నవరం మండలం పాలెం అడ్డరోడ్డులోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం ఉండటంతో బయలుదేరారు. ఉదయం 5.30 గంటల వేళ.. ఆటోలు లేవు. ఈ క్రమంలో ఆగిరిపల్లిలోని గెయిల్ కంపెనీలో డ్యూటీకి వెళుతున్న విశ్రాంత సైనికోద్యోగి సుంకర దుర్గారావు (43) కనిపించగా.. లిఫ్ట్ అడిగి ద్విచక్రవాహనం ఎక్కారు. నున్న శివారు వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వ్యాను వారిని ఢీ కొంది. ఇద్దరూ గాలిలో ఎగిరి రోడ్డు పక్కన పడిపోయారు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనం అద్దం, దిష్టికి కట్టే దండ ఘటనాస్థలంలో పడ్డాయి. దీన్ని బట్టి.. అది మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం అయి ఉండడొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దానిపై ఆరా తీస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సూచించినట్లు దినసరి వేతనం రూ.850 ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సమన్వయకర్తలు బుడుపుల జయశ్రీ, బి.రంగా డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవో వాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికులకు జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రసవ సమయంలో మహిళలకు రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు.

సిమెంట్ రహదారి.. మురుగు కాలువలా మారి!

మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లపై కూడా మురుగు దర్శనమిస్తోంది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించారే కానీ వాటికి అనుసంధానంగా డ్రెయినేజీలను ఏర్పాటు చేయలేదు. రోడ్లు కూడా లో లెవల్‌లో నిర్మించడం, ఇళ్లతో పాటు డ్రెయినేజీల ఎత్తు పెరిగిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. ముఖ్యంగా మండవల్లి బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, మంచాల కాలనీలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే పదుల సంఖ్యలో విద్యార్థులు, వృద్ధులు రోడ్లపై జారిపడి గాయాలపాలైన ఘటనలున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై కార్యదర్శి కొండలను వివరణ కోరగా రోడ్లు కంటే డ్రెయినేజీలు ఎత్తులో ఉండటంతో సమస్య వస్తుందన్నారు. మురుగు నిలిచిన ప్రాంతంలో బ్లీచింగ్ చల్లిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, మండవల్లి**


మండవల్లి: బాలికల వసతి గృహానికి వెళ్లే దారి

51 పనులకు రూ.3.24 కోట్లు మంజూరు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జీవనాడి కార్యక్రమంతో ఉద్యాన రైతులు లాభాల బాట పడుతున్నారని ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. నూజివీడు ఎంపీడీవో సమావేశ మందిరంలో కార్యదర్శులు, రైతులు, ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పథకంలో భాగంగా ఉద్యాన రైతులకు అనేక రాయితీలు అందజేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి 51 పనుల నిమిత్తం రూ. 3.24 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

అదుపు తప్పిన కారు..

ముగ్గురికి గాయాలు

చాట్రాయి, న్యూస్‌టుడే: సత్తుపల్లి-విజయవాడ రాష్ట్రీయ రహదారిలో సూరంపాలెంలో ఆదివారం అర్ధరాత్రి కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. చింతలపూడి మండలం ఎర్రంపల్లికి చెందిన గోలి వెంకటేశ్వరరెడ్డి బంధువులతో కలిసి కారులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా సూరంపాలెంలోని మలుపులో కారు అదుపు తప్పి పక్కనున్న డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. వాహనాన్ని నడుపుతున్న గోలి వెంకటేశ్వరరెడ్డి, మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై డి. రామకృష్ణ ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఆయన తెలిపారు.



మీ త్యాగం సమాజం మరవదు


నూజివీడు: పోలీసుల ప్రదర్శన

కలిదిండి, నూజివీడు పట్టణం, మండవల్లి, కైకలూరు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విధుల్లో ప్రాణ త్యాగం చేసిన పోలీసులను సమాజం ఎన్నటికీ మరవదని, వాళ్ల కుటుంబానికి పోలీస్ శాఖ అండగా నిలుస్తుందని పలువురు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో నిర్వహించారు. ★ కైకలూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కలిదిండి మండలం మూలలంకలో అమరవీరుడు కర్రి మనోజ్‌కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కైకలూరు నుంచి కలిదిండి మీదుగా మూలలంక వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ★ నూజివీడు పట్టణంలో డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో అమరులైన పోలీసుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ★ మండవల్లి ఎస్సై రామచంద్రరావు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ★ సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమని కైకలూరు సర్కిల్, పట్టణ సీఐలు కె.రవికుమార్, పి.కృష్ణ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించారు. ★ ఆగిరిపల్లిలో ఎస్సై కె.శుభశేఖర్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఎస్సై నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో..

కానిస్టేబుల్ నాగబాబుకు పురస్కారం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బత్తిన నాగబాబు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. సోమవారం ఏలూరులో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో వృత్తిలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గానూ కలెక్టరు వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతుల మీదుగా నాగబాబు పురస్కారం అందుకున్నారు.



రహదారులు బాగు చేయించాలని వినతి

మండవల్లి, న్యూస్‌టుడే: రోడ్ల మరమ్మతులు చేసి ఆర్టీసీ బస్సులు తిరిగేలా చూడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు, అప్పారావు మీ-కోసంలో ఇన్‌ఛార్జి తహసీల్దార్ గోపాల్, ఈవోపీఆర్డీ శేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండవల్లి మండలంలోని 29 పంచాయతీల్లో 20 పంచాయతీల్లో ఆర్టీసీ బస్సులు వెళ్లే వీలు లేకుండా పోయిందన్నారు. దీంతో ఆటో, ట్రాక్టర్లపై ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యం రోడ్లు పాడవడం వల్లే ఆపేశారని వాపోయారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ముసునూరు, న్యూస్‌టుడే: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో వారిలోని నైపుణ్యాలను వెలికి తీయొచ్చని ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ బక్కావరీ అన్నారు. సోమవారం ముసునూరు మండలం చెక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక అవసరాల గల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జి.యోగిత, పద్మకిశోర్, కళాధర్, రాంబాబు, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రదర్శన

రైతులకు రాయితీ పథకాలు

చాట్రాయి, న్యూస్‌టుడే: రాయితీ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాల సమితి డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అన్నారు. చీపురుగూడెం సంఘ పరిధిలో సభ్యులు చనుమోలు వేణుమాధవన్ కుమార్తె గౌతమి వివాహాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన బంగారు నాణెంను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచేందుకు మరింత కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ బయ్యా వెంకటేశ్వరరావు, కార్యదర్శి పాపోతు రాంబాబు రైతులు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న హీల్ ప్రతినిధులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్తు సెంట్రల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో బృంద విభాగంలో హీల్ బాలికల బృందం ద్వితీయ స్థానం కైవసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కె.అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నేడు మండల సమావేశం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మార్టిన్
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వేట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటిన జగన్మోహనరావు, గ్రామస్థులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చిగురుకోట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రామస్థులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. సామాజిక కార్యకర్త కొడాలి కృష్ణప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త అరుణకుమారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై దాడి

చాట్రాయి, న్యూస్‌టుడే: తెలంగాణ సరిహద్దులోని ఓ మామిడి తోటలో జూద క్రీడల నిర్వహణపై సోమవారం ఎస్సై డి.రామకృష్ణ దాడి చేశారు. కృష్ణారావుపాలెంలో మామిడి తోటలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై దాడి చేసి పదకొండు మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,450, అయిదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా రైతులు మద్దతు ధర పొందవచ్చని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ఉప తహసీల్దారు జి.పవన్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పౌరసరఫరాల జిల్లా కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి కొనుగోలు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.